క్లుప్తంగా

జిల్లా స్థాయి వాలీబాల్ రన్నర్‌గా వేజండ్ల జట్టు



చేబ్రోలు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో వేజండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి మహిళల వాలీబాల్ పోటీల్లో బాలికల జట్టు రన్నర్‌గా నిలిచిందని తెలిపారు. కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, నగర కమిషనర్ చేకూరి కీర్తి మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడాకారులను, పీఈటీ వెంకటేశ్వరరావును హెచ్ఎం టి.విజయశ్రీ, ఉపాధ్యాయులు, అభినందించారు.

గుంటూరు వెళ్లి.. పింఛను ఇచ్చి

పెదకాకాని: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పల్లె అవ్వమ్మకు వలంటీర్ ప్రియదర్శిని ఆదివారం పింఛను నగదు అందజేశారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న పల్లె అవ్వమ్మకు పింఛను అందజేయడంతో కుటుంబ సభ్యులు అభినందించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ఉన్నతం



నెహ్రూనగర్: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం ఎంతో ఉన్నతమైనదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ ఈశ్వరీదేవి పీఠం రాష్ట్రవ్యాప్త ధార్మిక పర్యటనలో భాగంగా కందిమల్లాయపాలెం నుంచి గుంటూరుకు వచ్చింది. ఈ సందర్భంగా అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల ప్రత్యేక కళా నైపుణ్యత వెలకట్టలేనిదని కొనియాడారు. దేవాలయాల్లో పూజించే భగవంతుని రూపాన్ని భక్తులకు సుందరమైన రీతిలో అందించే భాగ్యం విశ్వబ్రాహ్మణుకే దక్కుతుందని తెలిపారు.

జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్ క్యాన్సర్ విభాగంలో రోగులకు అవసరమైన అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యూలేటర్, మామోగ్రామ్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వైద్య పరికరాలతో పాటు ఎంతో అనుభవం ఉన్న క్యాన్సర్ వైద్యులు ఉన్నారని చెప్పారు. గతంలో చెన్నై, బెంగళూర్, హైదరాబాద్‌లకు రోగులు వెళ్లే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనే అన్ని వైద్యసేవలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ కోనేటి నందన తేజ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండోమెంట్ అవార్డుల ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చిపులుసు రామకుమారి ఎనిమిదో వర్ధంతి సందర్భంగా ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై పచ్చిపులుసు రాఘవరావు, రామకుమారి ఎండోమెంట్ స్కాలర్‌షిప్పులను గుంటూరు చలమయ్య – కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందజేశారు. అనంతరం వేదవతి భాగవతారణి ఆలపించిన భక్త మార్కండేయ హరికథ భక్తులను రంజింప చేసింది. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, పచ్చిపులుసు రాఘవరావు, పచ్చిపులుసు ప్రభావతి విజయ శంకర్, వాణి సతీష్, డాక్టర్ లక్ష్మీ సునీత ఆదినారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, సునీత, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లె ఆరోగ్యానికి భరోసా..

- అత్యాధునిక వసతులతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్లు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



దండమూడి విలేజ్ క్లినిక్



మన్నవ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇది కదా.. అభివృద్ధి

పొన్నూరు: గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఆర్థిక స్తోమత లేనివారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భద్రత కల్పించేందుకు వైద్య రంగానికి పెద్దపీట వేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించేందుకు గ్రామ సచివాలయాలు కేంద్రాలుగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటితో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయి.

- మన్నవ వైఎస్ఆర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం .. మండలంలోని 14 గ్రామాలలో 28,400 మంది గ్రామీణ ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించడంలో అగ్రగామిగా నిలిచింది. గత టీడీపీ హయాంలో ఈ వైద్యశాల్లో సరైన వసతులు కల్పించక.. ప్రజలకు సేవలందించడంలో వెనుకంజలో ఉండేది. సీఎం జగన్ వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మండలంలో ఉత్తమ వైద్యశాలగా పేరుగాంచింది. గతంలో ఒక వైద్యుడితో సాగే వైద్యశాలలో ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారులు, 3 స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, ఎస్ఎన్ఓ వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (గతంలో సబ్ సెంటర్లు)లలో బీఎస్సీ చదివిన నర్సింగ్ విద్యార్థులు మినీ డాక్టర్లుగా సేవలందిస్తున్నారు. వారితో పాటు 13 మంది ఏఎన్ఎంలు, ప్రజలకు బీపీ, షుగర్ తదితర రోగాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేసి, వైద్యసేవలు అందిస్తున్నారు. వెయ్యి మంది ప్రజలకు 1 ఆశ వర్కర్ ఉండి మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందిచడంలో సహకారం అందిస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి చూపు తగ్గిన వారిని గుర్తించి 1000 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 68 మందికి కంటి శుక్లాలు తీయించి మెరుగైన వైద్యసేలందించారు.
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడంతో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి నెలలో రెండుసార్లు 104 వాహనం ద్వారా ప్రజల ఇంటివద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. చికిత్స అవసరమైన వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.
- మన్నవ పీహెచ్‌సీ పరిధిలో వెల్లలూరు, దండమూడి, మామిళ్లపల్లి గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు నూతన భవనాలు పూర్తయి వైద్య సేవలందిస్తున్నాయి. మిగిలిన గ్రామాల్లో నాడు నేడు పథకం ద్వారా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రణాళిక ప్రకారం శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు 104 వాహనంతో వెళ్తున్నాం. ఉదయం నుంచి గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందిస్తున్నాం. 105 రకాల మందులు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటున్నాయి. రోజు అన్ని హెల్త్ క్లినిక్‌ల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– షేక్. మహమ్మద్ హుస్సేన్, వైద్యాధికారి, మన్నవ పీహెచ్‌సీ.

ఇంటివద్దనే వైద్య సేవలు.. ప్రభుత్వ లక్ష్యం



సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి పెద్దపీట వేశారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి జరిగింది. గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయి. అత్యవసర సమయాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు.

– కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే

ఎస్సీలకు చట్ట సభల్లో ప్రత్యేక స్థానం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ఎస్సీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: ఎస్సీలకు చట్ట సభల్లో ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలో ఆదివారం మండల ఎస్సీ నేతలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులోని పుల్లడిగుంటలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలివెళ్లారు. కుర్నూతల ఎస్సీ కాలనీలోని మేరిమాత విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేదికపై వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న ఆశలు, ఆశయాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణం పోస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన ఐదేళ్ల కాలంలో ఎస్సీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అటు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు, ఇటు దళితవాడల్లో అభివృద్ధి ఫలాలను అందించిన నాయకుడు జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. చట్టసభల్లో ఎస్సీలకు ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లోనూ మరోసారి సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధమా.. అంటూ కార్యకర్తలను, పార్టీ శ్రేణులను ఉత్సాహపరించారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మన్నవ వీరనారాయణ, ఎంపీపీ చిలకా రాజ్యం, వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు యర్రాకుల గోపాలకృష్ణ, గుమ్మడి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బుర్రి ప్రకాష్, మైనార్టీ సెల్ కన్వీనర్ సయ్యద్ నూరుల్లా, సచివాలయాల మండల కన్వీనర్ నాదెండ్ల రామచంద్రయ్య, ఎస్సీ నాయకులు మంచాల భాగ్యారావు, బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం

గుంటూరు రూరల్: సమష్టిగా కృషి చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. చంద్రబాబు, అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నాయని గుర్తు చేశారు. ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని గుర్తుచేశారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు జగనన్న అని కొనియాడారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త జగనన్నకు అండగా నిలిచి మన ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పత్తిపాడు నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ వివాదంపై కేసులు నమోదు

గుంటూరు రూరల్: స్థలం ఆక్రమణ విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంపై నల్లపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. చౌడవరం గ్రామం సీఆర్ నగర్‌లో ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని దేవానాయక్ అనే వ్యక్తి ఆక్రమించాడని స్థానికులు అతనితో వివాదానికి దిగారు. వివాదంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాంబాబు తెలిపారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు-2 సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియనిస్ తెలిపారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటి వెళ్లి ఆరోగ్య సర్వే పూర్తి చేసి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని ప్రాథమిక పరీక్షలు చేశారన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం వారంతా రేపు జరగనున్న శిబిరానికి హాజరయ్యేలా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు చూస్తారన్నారు. శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

పేకాట స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై దాడిచేసి జూదరులను అరెస్ట్ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల మేరకు.. బుడంపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడిచేయగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలుడి అదృశ్యంపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 29న కృష్ణబాబు కాలనీకి చెందిన 16 సంవత్సరాల దేవెళ్ల కార్తిక్ ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీకే సాధ్యం

- 25 ఏళ్లుగా జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించాం
- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



పెదకాకానిలో ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా సాధ్యమైందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆలపాటి రాఘవ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే అన్ని సేవలు అందుతున్నాయన్నారు. కులాలకు, మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. 25 ఏళ్లుగా పొన్నూరు నియోజకవర్గంలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల్లో చేసి చూపించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,600 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. పొన్నూరు పట్టణంలో ప్రజలు రోడ్డు విస్తరణ కోసం 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని, 165 ఏళ్ల క్రితం చేబ్రోలు శివారులో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరితే నిర్మాణం పనులు చేపట్టామన్నారు. ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు తాగునీరు పంపిణీ చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. ప్రతి పక్షాల అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. అభివృద్ధి పనులు చూసి, ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే రోశయ్య కోరారు. అనంతరం పార్టీ ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్లజ్యోతి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, మేరిగ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, బంగారు మరియమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ నజీర్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకర కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వింజనంపాడులో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో కిట్స్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గుంటూరు నగరానికి చెందిన రాజశేఖర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కార్తీక్ రోగులకు షుగర్, బీపీతో పాటు ఎముకల సమస్యతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మాత్రలను అందించారు. హనుమ ఐ కేర్ వైద్యాధికారి డాక్టర్ సుబ్రమణ్యం 220 మంది రోగులకు నేత్ర పరీక్షలు చేసి మాత్రలందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు గ్రామంలో సేవా కార్యక్రమాలు జరపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చంద్రరెడ్డి, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ లూథరన్ చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు చర్చి మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన శ్మశాన వాటికను పరిశీలించారు. అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


11న గాయకులకు స్వరరత్న పురస్కారాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రంగారావు, గాయకులు

పాత గుంటూరు: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామం వేదికగా విశిష్ట గాయకులకు స్వరరత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. అనంతరం జరిగే సభలో అతిథులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఘంటసాల కృష్ణకుమారి పాల్గొని 14 మంది గాయకులకు పురస్కారాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నాజ్‌సెంటర్‌లోని ఘంటలసాల విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంగీత గురువు త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ బి. జయామూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ హరి కథకులు శంభయాచారి త్యాగరాజస్వామి వేష ధారణలో ఆయన కీర్తనల ఆలాపనతో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం పంచరత్న కీర్తనల గానం జరిగింది. శాస్త్రీయ సంగీత కచేరిలో చెన్నైకు చెందిన సాయి విఘ్నేష్ పలు త్యాగరాజస్వామి కృతుల్ని శ్రావ్యంగా గానంచేసి సంగీతాభిమానుల్ని అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం.డి.వి. రమణారావు మాట్లాడుతూ అయోధ్యలో రాముడి ప్రతిష్ఠ జరిగిన ఈ సంవత్సరం త్యాగరాజ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని తెలిపారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలతో నగరోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారుల్ని అభినందించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కేక్ కట్‌చేస్తున్న పూర్వ విద్యార్థులు

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1995–96 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నల్లపాడు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా అలనాటి పాఠశాలలోని తీపి గుర్తులు, జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తుచేసుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. తమ గురువులను సన్మానించుకున్నారు. 25 ఏళ్ల తరువాత తామంతా కలిసినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

సినీ నటి పూర్ణిమకు సత్కారం

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జగ్గయ్యపేట న్యాయమూర్తి యం. శోభారాణి, డాక్టర్ వేమూరి నాగశంకర్, డాక్టర్ లయన్ బాబు మిరియం, కె.బి. శెబాస్టియన్ పాల్గొని జ్యోతి ప్రకాశనం చేశారు. అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు రసూల్ బాబు, ఉపేంద్రసింగ్, కొల్లా వెంకటేశ్వరరావు, ఎం. హెలెన్‌కుమారి, శోభారాణి, సుధా శ్రీనివాస్, రాణి, కె. జయలక్ష్మి మధురంగా ఆలపించారు. అనంతరం సభలో సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి



కిశోర్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న హెనీ క్రిస్టినా, వసంత రాయిడు

గుంటూరు ఎడ్యుకేషన్: విధి నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కనుమూరి కిశోర్‌కుమార్‌కు ఆత్మీయ సన్మానాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు ఎన్నటికీ గుర్తుండిపోతారని తెలిపారు. అనంతరం కిశోర్‌కుమార్ దంపతులను సత్కరించారు.